
ప్రజాశక్తి
శుక్రవారం 15 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం



విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ స్థలానికి సంబంధించిన వివాదంపై రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు పిబి శ్రీనివాస్ చెప్పారు. ఈ స్థలం వివాదంలో తాము లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా మున్సిపల్ అధికారులు ఆ అసెస్మెంట్‌ను కొనుగోలుదారుల పేరిట మ్యుటేషన్ చేశారని, ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అది పట్టణంలోని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందిన ఆస్తి అని ఆధారాలు సమర్పించినా పట్టించుకోకుండా అధికారులు మ్యుటేషన్ చేశారని చెప్పారు. దీనిపై విజిలెన్స్ కమిషనర్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఆ మూడుచోట్లా ఉత్కంఠ

- చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండలో ఖరారుకాని అభ్యర్థుల పేర్లు
- ఆశా వాహుల్లో తీవ్ర నిరాశ



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చీపురుపల్లిలో సీనియర్‌ను రంగంలోకి దింపేందుకు స్థానిక యువ నాయకుడ్ని పక్కనబెట్టేందుకు ప్రయత్నాలు. ఎస్.కోటలో యువ నాయకుడి కోసం సీనియర్‌ను పక్కనబెట్టే ఆలోచన. అటు మన్యం జిల్లా పాలకొండలో గెలుపు గుర్రం కోసం వెతుకులాట. దీంతో, ఈ మూడు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులు ఎవరో అంటూ ఆసక్తికరమైన చర్చనడుస్తోంది. అటు టిడిపి శ్రేణుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. టిడిపి అధిష్టానం విడుదల చేసిన మొదటి జాబితాలో ఉమ్మడి జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండ మినహా మిగిలిన 8స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం ప్రకటించిన రెండవ జాబితాలోనూ ఈ నియోజకవర్గాల అభ్యర్థుల ప్రస్తావన లేకపోవడంతో ముఖ్యంగా టిడిపి శ్రేణులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. చీపురుపల్లిలో వైసిపి సీనియర్ నేత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఢీకొట్టే పేరుతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపేయోచనలో టిడిపి అధిష్టానం ఉన్న విషయం విధితమే. గంటాను అధిష్టానం ఆదేశించి సుమారు 25రోజులు కావస్తున్నప్పటికీ ఆయన తన నిర్ణయాన్ని బహిర్గతం చేయలేదు. దీంతో, రెండో జాబితాలో కూడా చీపురుపల్లి నుంచి ఎవరు రంగంలోకి దిగుతారనేది ఇంకా తేలలేదు. ఇదే అదునుగా ఆ నియోజకవర్గం నుంచి పోటీకి దిగనున్న మంత్రి ప్రచారంలో తనదైన శైలి ప్రదర్శిస్తున్నారు. దాదాపు వారానికి నాలుగు రోజులు నియోజకవర్గంలోనే పర్యటిస్తూ తన బలాన్ని పెంచుకునే పనిలో నిమగ్నమయ్యారు. టిడిపి ఇంకా అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందంటూ టిడిపి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి నెలకుంది. మరోవైపు చీపురుపల్లి నుంచి సీటు ఆశిస్తూ ఇన్నాళ్లూ పార్టీని నడిపించిన స్థానిక పార్టీ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మరికొన్ని రోజులు ఎదురు చూపులు తప్పని దుస్థితి ఏర్పడింది. ఎస్.కోటలో సీనియర్ ఎమ్మెల్యే, కోళ్ల లలిత కుమారి కూడా సీటు కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. పార్టీలో ఈసారి చాలా చోట్ల యువతను ప్రోత్సహించే లక్ష్యంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ పేరును పరిశీలిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అటు పాలకొండ లోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జికి ప్రత్యామ్నాయం చూస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది. దీనికితోడు ఆశావహులు ఎక్కువగా ఉండడం వల్ల అధిష్టానం గెలుపు గుర్రాన్ని గుర్తించలేక పోతుంది. ఈనేపథ్యంలో ఈ మూడు నియోజక వర్గాల్లోనూ ఇన్‌ఛార్జులను పక్కనబెట్టే యోచనలో ఉన్నట్టుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో, ఈ మూడుచోట్ల ఉత్కంఠ భరితమైన చర్చ సాగుతోంది. ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య



ప్రజాశక్తి-బొబ్బిలి

పదో తరగతి పరీక్షలకు బాగా చదవాలని తల్లిదండ్రులు మందలిం చడంతో మనస్థాపం చెందిన విద్యార్థిని గెద్ద మానస ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన మానస పదో తరగతి చదువుతుంది. పరీక్షలు దగ్గర పడడంతో బాగా చదవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారి నిద్రలేచిసరికి కుమార్తె విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో తల్లిదండ్రులు అరుణకుమారి, శంకరరావు బోరున విలపించారు. మానసకు తమ్ముడు ఆదర్శ్ ఉన్నాడు. విద్యార్థిని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిజెపి వ్యతిరేక విధానాలపై

రైతు, కార్మిక సంఘాల నిరసన

- వాటి మద్దతు దారులను ఓడించండి
- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రదర్శన, మానవహారం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబరులో రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని కోరుతూ, సయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన రైతులు, కార్మికులు గురువారం స్థానిక బెలగాంలో గల గురజాడ అప్పారావు విగ్రహం నుంచి మెయిన్ రోడ్డు మీదగా పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా ఐక్యవేదికల నాయకులు మాట్లాడుతూ గతంలో రైతులకు మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో, రెండో దఫా పోరాటాలకు ఢిల్లీ బయలుదేరిన రైతాంగాన్ని హర్యానా సరిహద్దుల్లోనే బిజెపి ప్రభుత్వం అడ్డగించిందని, కందకాలు తవ్వడం, మేకులు నాటడం, బారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పరచడం, వాటర్ క్యాన్లు ప్రయోగించడం, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడంతో పాటు డ్రోన్ల ద్వారా విషవాయువులు చిమ్మి, రైతాంగంపై కర్కశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రెండేళ్ల నుండి రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు పరచకుండా రద్దు చేసిన నల్ల చట్టాలనే దొడ్డిదారిలో అమలుకు ప్రయత్నిస్తుందని అన్నారు. ఈ స్థితిలో మరొక్క మారు దేశవ్యాప్తంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులు తమ కోర్కెలను గొంతు విప్పి వినిపించాలని ఢిల్లీలో భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చాయని, వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకోవాలంటే మోడీని, వారి మిత్రులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సి2+50% ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టపర్చాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కడప ఉక్కును ప్రభుత్వరంగంలోనే నిర్మించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలి, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిషోర్ మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాసు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల.సత్యనారాయణ, జిల్లా నాయకులు వెంకటనాయుడు, రైతు కూలీ సంఘం నాయకులు బాషా, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. సంగం, ఎఐటియుసీ నాయకులు జీవ, గిరిజన సంఘం నాయకులు పాలవలస రాము, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి. రంజిత్, జయమణి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, పలువురు రైతులు, కార్మికులు పాల్గొన్నారు.



మానవహారాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాసు, నాయకులు

సీతానగరం : రైతులు పండించే పంటకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ ఢిల్లీలో జరిగే రైతు సంఘాల నిరసనకు మద్దతుగా స్థానిక హనుమాన్ జంక్షన్‌లో రాస్తారోకో జరిగింది. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విధానాలతో రైతులు, కార్మికులు, ఉపాధి కూలీలు జీవనోపాధి కోల్పోతున్నారని, ప్రజానీకం నానా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విధానాలను తిప్పుకొట్టేందుకు అన్ని ప్రజా సంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, రైతు, వ్యవసాయకార్మిక, భవన నిర్మాణ కార్మికసంఘాల నాయకులు బి.అప్పారావు, సిహెచ్ కృష్ణ, రాముతో పాటు వివిధ ప్రజాసంఘ నాయకులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

త్వరితగతిన వంద పడకల ఆసుపత్రి పూర్తి

నిర్మాణ పనులు పరిశీలించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వంద పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. గురువారం ఆయన వందపడకల ఆసుపత్రి నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. కాంట్రాక్టరు ఆసుపత్రి నిర్మించి ఫిబ్రవరి నాటికి అప్పగిస్తామని చెప్పినట్లు తెలిపారు. అయితే ఇంకా చివరి దశ పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం వుందన్నారు. ఏరియా ఆసుపత్రి కావడంతో నిపుణులైన వైద్యులు వున్నారని చెప్పారు. అవుట్ పేషెంట్ సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. రోజూ 350 నుంచి 400 వరకు ఆసుపత్రికి రోగులు వైద్యం కోసం వస్తున్నారని చెప్పారు. ఇన్ పేషెంట్ సంఖ్య కూడా పెరిగిందన్నారు. అయితే వసతి సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. ఆసుపత్రి ప్రాధాన్యత దృష్ట్యా అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దీని గురించి సంబంధిత వైద్య ఆరోగ్య మంత్రి , సిఎం జగన్ మోహన్ రెడ్డి లతో మాట్లాడతానని చెప్పారు.

సిఆర్‌ఎం యంత్రాన్ని ప్రారంభించిన రాజన్నదొర

ఆసుపత్రిలో ఎముకల వైద్య సేవలకు సంబంధించిన సిఆర్‌ఎం యంత్రాన్ని రాజన్నదొర ప్రారంభించారు. ఎముకలకు సంబంధించిన శస్త్ర చికిత్సలకు ఉపయోగపడే ఈ యంత్రం సుమారు రూ.15లక్షల విలువ చేసేదని సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి చెప్పారు. దీన్ని ఉపయోగించి రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పిల్లల ఆరోగ్యం, ఆహారం పట్ల సంబంధిత వార్డెన్లు, హెచ్‌ఎంలే బాధ్యత వహించాలని కోరారు. పిల్లల కోసం ఇళ్ల నుంచి వారి తల్లిదండ్రులు తీసుకొచ్చే ఆహారాన్ని హెచ్‌ఎం, వార్డెన్లు తనిఖీ చేసిన తర్వాత పిల్లలకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్లు రాపాక మాధవరావు గొర్లి వెంకటరమణ, జి.నాగేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల ప్రకటన వెలువడిన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు అధికారులతో కలెక్టరు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే అమల్లోకి రానున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా అమలు పర్చేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి ఉల్లంఘనలకు అవకాశం లేకుండా, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయం, ప్రాంగణాల్లో గల ఫోటోలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రచార సామగ్రిని 48 గంటల్లోగా తొలగించాలని, అనుమతి లేని హోర్డింగులు తొలగించాలని సూచించారు. ప్రైవేటు ఆస్తుల్లో గల వాటిని తొలగించేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిధిలోనికి వస్తారని, అన్ని స్థాయిల ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీ బృందాలు విధులకు సంబంధించి ఎన్నికల సమయంలో జప్తుచేసిన డబ్బు, ఇతర వస్తువులకు సంబంధించి ఎన్నికల జప్తు నిర్వహణ వ్యవస్థ (ఇ.ఎస్.ఎమ్.ఎస్.) యాప్ రూపొందించడం జరిగిందని, తనిఖీ బృందాలు వారు పట్టుకున్న డబ్బు, ఇతర వస్తువులను జప్తుచేసి కేసు పెట్టడంతో పాటు వాటి వివరాలను ఈ యాప్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, అధిక మొత్తంలో నగదు పట్టుకున్నప్పుడు ఆదాయపు పన్నులశాఖ వారికి సమాచారం అందించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎన్నికలు అనంతరం కూడా అమలులో ఉంటుందని, ఎన్నికల కమిషను అధికారికంగా ప్రకటన చేసే వరకు కోడ్ అమలులో ఉంటుందని అధికారులు అప్రమత్తతతో సూచించారు. తనిఖీ బృందాల నోడల్ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి. గయాజుద్దీన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తనిఖీ బృందాలు విధులకు సంబంధించిన నియమ నింబంధనలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జెసిఎస్.ఎస్. శోబిక, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి సూర్యనారాయణ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్యాంపెయిన్

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు చేరాలంటూ అధ్యాపకులు గురువారం పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో క్యాంపెయిన్ నిర్వహించారు. అధ్యాపకులు డి.రామకృష్ణ, ఎస్.అచ్చెన్నాయుడు, శ్రీధర్, బి.రమేష్ తదితరులు సీతానగరం, జడ్పీహెచ్ స్కూల్, బూర్జ ఆర్‌సిఎం స్కూల్ పాఠశాలల్లో క్యాంపెయిన్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ల్యాబ్, సిబ్బంది, ప్రభుత్వం నుంచి అనేక పథకాలు వర్తిస్తాయన్నారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

మంచి చేసే వారికే పట్టం కట్టండి

వంతెన ప్రారంభ సభలో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - వీరఘట్టం

పది కాలాలు మంచి చేసే వారికి పట్టం కట్టాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలను కోరారు. మండలంలోని కిమ్మిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రంతో పాటు రూ.27.5 కోట్లతో నిర్మించిన వంతెన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు వంటి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. నిజాయితీ నిబద్ధతో మీ నమ్మకంతోనే పాలిస్తున్నామని అన్నారు. సచివాలయానికి 35 మంది ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందిస్తున్నట్లు స్పష్టం చేశారు. జగన్మోహన్‌రెడ్డి దిగిపోతే మీకు ఈ పథకాలు వస్తాయా? అవి రావాలి అంటే ఇక్కడ ఎమ్మెల్యే కళావతిని, అలాగే ఎంపీగా భాగ్యలక్ష్మిని గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డినే ఎన్నుకోవాలన్నారు. నాటి ముఖ్యమంత్రి కిమ్మి వంతెనకు అనుమతులిస్తే ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి పాలనలో వంతెను ప్రారంభించడం సంతోషకరమన్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తున్నారని, ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు వస్తున్నారని, ఆయన మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ వంతెన ప్రారంభించడం వల్ల అటు విజయనగరం జిల్లా రాజాం, ఇటు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలాలకు చెందిన ప్రజలు ప్రయాణించేందుకు సులువుగా ఉందని అన్నారు. ప్రజల చిరకాల వాంఛను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీర్చారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రామ్మోహన రావు, ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, జడ్‌పిటిసి జంపు కన్నతల్లి, సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, మండల వ్యవసాయ శాఖ కమిటీ చైర్మన్ కర్రి లీలాప్రసాద్, గృహ నిర్మాణశాఖ బోర్డు డైరెక్టర్ భోగి లతా మాణిక్య చంద్రశేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్ రంభ శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, వంగర ఎంపిపి ముఖర్జీ, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబిసి నేస్తం మూడో విడత నిధులు విడుదల

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ఇబిసి నేస్తం పథకం కింద మూడో విడత నిధులు విడుదలయ్యాయని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాట్లు చేసిన ఈ కార్యక్రమంలో జెసి పాల్గొన్నారు. ఈ ఆమె మాట్లాడుతూ 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలకు ఏడాదికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ ఆర్థికం సంవత్సరం 1193మంది లబ్ధిదారులకు రూ.178.95 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ రంగముద్రి రమాదేవి, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.నాగమణి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతి, ఎస్.కృష్ణ , బిసి కార్పొరేషన్ ఎఇఒ జి.గోపి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శోభిక



ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన ఇవిఎమ్ లు, వివిప్యాట్ లను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం పరిశీలించారు. పీరియాడికల్ తనిఖీల్లో భాగంగా ఇవిఎమ్ లు తనిఖీలు చేపట్టామని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే తదుపరి ప్రక్రియ ప్రారంభించి నియోజక వర్గాలకు పంపిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఇన్చార్జి డి అర్ ఓ జీ.కేశవ నాయుడు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్ కె.ఆనందరావు, డిటి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మీనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎపిఒ పి.భానుకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆరువారాలుగా వెన్నెలబుచ్చెంపేట, వెంకటాపురం గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అంతేకాక గత నెల రోజులుగా పనిచేసిన పంచాయతీల్లో ఉపాధి బిల్లులు చెల్లించలేదని తక్షణమే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఎపిఒకు వేతన బకాయిలు చెల్లించాలని కోరుతున్న వేతనదారులు, వ్యవసాయకార్మికసంఘం నాయకులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మహిళా దినోత్సవ వారోత్సవాల్లో దిశ డిఎస్‌పి

ప్రజాశక్తి - సాలూరు

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా దిశా డిఎస్‌పి ఎస్ఆర్ హర్షిత కోరారు. గురువారం గుమడాం సమీపంలో ఉన్న వైటిసిలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మాట్లాడుతూ ఆడపిల్లలను ఉన్నత విద్య వరకు చదివించాలని కోరారు. మహిళ చదువుకుంటే ఇంట్లో వారందరి చదువు పట్ల శ్రద్ధ వహిస్తుందన్నారు. మహిళా రక్షణకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన వుంటే ఆరోగ్య వంతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. ఐసిడిఎస్ సిడిపిఒ బి.సత్యవతి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే మహిళలు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని చెప్పారు. నీడ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణకు ఉన్న చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, రాజారాం మోహన్‌రాయ్, స్వామి దయానంద సరస్వతి, జ్యోతిరావు పూలే, గురజాడ అప్పారావు లాంటి మహానుభావులు మహిళా హక్కులు, ఆవశ్యకత గురించి, సమాజంలో వున్న సాంఘిక దురాచారాల గురించి పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో నీడ్ పిసి మోహన్, మహిళా కోఆర్డినేటర్ రత్నం పాల్గొన్నారు.

కురుపాం : అంతర్జాతీయ మహిళా దినోత్సవమంటే మహిళల హక్కుల కోసం స్ఫూర్తి నిచ్చే రోజని శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకురాలు వి.ఇందిర అన్నారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి. సరళ కుమారి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉపాధి, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని మహిళలు పోరాడు తెచ్చుకున్న చట్టాలు అమలు కావడం లేదని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో మహిళలకు రక్షణ పూర్తిగా కరువైందని అన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ కె.విజయగౌరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో సమానంగా పనిచేస్తున్నారని అయినా ఈరోజు ఆడపిల్లలు పుట్టనీయకుండా చేస్తున్నారని, కుటుంబ సభ్యుల దగ్గర కూడా ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు గౌరీ, జానకి, శ్రావణి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జె.సరోజ, కృష్ణవేణి, రత్నం, రాగిణి, సులోచన తదితరులు పాల్గొన్నారు.



సాలూరు : వారోత్సవాల్లో మాట్లాడుతున్న దిశా డిఎస్‌పి హర్షిత



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - సీతానగరం

మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగో విడత చేయూత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. మండలంలోని 5430 మంది డ్వాక్రా మహిళలకు రూ.10 కోట్ల 18 లక్షలు అందజేశారు. రాబోయే ఎన్నికల్లో మహిళలంతా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రవణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిటిసి సభ్యులు బురిడీ కుసుమా సూర్యనారాయణ, సారగాల గౌరీ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు బట్టలు అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

గిరిజనులకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - కొమరాడ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజనులకు బట్టలు పంపిణీ చేసినట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు జోబు రామకృష్ణ తెలిపారు. మండలంలోని సీసాడవలసలో గిరిజన మహిళలకు, వృద్ధులకు చీరలు, బట్టలు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు జోబు రామకృష్ణ మాట్లాడుతూ మంచి మనసుతో కొంతమంది దాతలు గాయత్రి రెడిమేడ్ షాప్‌కు స్వచ్ఛందంగా వచ్చి అందజేసిన చీరలు, బట్టలను సీసాడవలసలో గిరిజనులకు, పేదలకు బట్టలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులు చుక్క చంద్రరావు, కోలా సీతారాం (రిటైర్డ్ రైల్వే), బొండపల్లి వెంకటరమణ, కొక్కోట లక్ష్మణరావు స్వచ్ఛంద సహాయకులు నందిగాన మురళి, సిపిఎం మండల కన్వీనర్ కొల్లి సాంబ మూర్తి, అంగన్వాడీ కార్యకర్త కొండగొర్రె వరలక్ష్మి పాల్గొన్నారు.

దిగువ కొలువరాయిలో విజ్ఞానమేళా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కీసరజోడు పంచాయతీ దిగువ కొలువరాయిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ బాలబాలికల సాంప్రదాయ సాంస్కృతిక విజ్ఞాన మేళా అంశంపై కార్యక్రమం నిర్వహించారు. వీటి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు, ఎంపిపిఇ ప్రధానోపాధ్యాయులు టి.దుర్గారావు, బి.నవీన్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బి.జగ్గయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సంజీవరావు పూర్వపు ఆహార అలవాట్లు, సంప్రదాయాల ప్రాముఖ్యత గురించి వివరించారు. వెలుగు అసోసియేషన్ సిబ్బంది బి.వెన్నెల, ఎస్‌టి మిన్నారావు, భాషా వాలంటీర్లు ఎస్.సుహాసిని, సుబ్బద పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా అధ్యక్షులుగా జయకృష్ణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులుగా పట్టణానికి చెందిన పిన్నింటి జయకృష్ణ నియమితులయ్యారు. ఆయనకు నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు ముని శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ తనను జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ ఇంజినీరింగ్ విభాగానికి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు, తనపై నమ్మకం ఉంచి తనను ఎంపిక చేసి ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర ఛైర్మన్ వేల్పుల రాము, రాష్ట్ర అధ్యక్షులు ముని శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన రాష్ట్ర ఎలిజిబిలిటీ సంఘానికి జిల్లా మెంబర్‌గా కూడా ఆయన సేవలు అందిస్తున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన జయకృష్ణకు జిల్లాలోని పలువురు ఇంజినీర్లు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని నగరపంచాయతీ ఛైర్మన్ యందవ రాధాకుమారి అన్నారు. గురువారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు ప్రవేశ పెట్టారు. అనంతరం పలువురు సభ్యులు పట్టణంలోని తాగునీటి సమస్యపై ప్రస్తావించగా ఛైర్‌పర్సన్ స్పందిస్తూ పై విషయం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ యందవ రాధా కుమారి, కమీషనర్ సర్వేశ్వరరావు, వైస్ ఛైర్మన్‌లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్ మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ఏదీ?

ప్రజాశక్తి - పాలకొండ

ఓటర్ల నమోదుపై ఇప్పటికీ గ్రామాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించలేదు. కేవలం మండల కేంద్రంలో, పట్టణాల్లో మాత్రమే అవగాహన సదస్సులు, చైతన్య ర్యాలీలు చేపట్టారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ఎక్కడా అవగాహన ఏర్పాట్లు చేపట్టినట్టు సమాచారం లేదు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఐపిఎల్‌లో ఓటు హక్కు వినియోగంపై ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన లేదనే చెప్పాలి. నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాల్లో మాత్రమే అవగాహన కల్పించిన అధికారులు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కురుపాం

సాగులో నాణ్యమైన విత్తనాలు ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బిఎస్ఎస్ పాత్రో అన్నారు. గురువారం రైతు ఉత్పత్తిదారులు, సంఘ సభ్యులు, రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసే, కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం పలు పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, ప్రవంతి, అను, అమ్మతవేణి, శరత్‌బాబు, వై.డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - కురుపాం

ఇటిక లోడుతో వస్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కస్పగదబవలసలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం వీరఘట్టం మండలం నడిమికెల్లకు చెందిన జి.గోపయ్య, కె.పోసయ్య, ఎం. సింహాచలం కూలీ పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై కురుపాం వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలి తండ్రితో మాట్లాడుతున్న సిపిఎంన ఆయకులు

విద్యార్థుల మరణాలపై విచారణకు కమిటీ వేయాలి : సిపిఎం

కొమరాడ : గిరిజన చిన్నారి ఊయక తేజశ్రీ (7) జ్వరంతో బాధపడుతూ మరణించడం చాలా బాధాకరమైన విషయం అని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడ ఇందిరా అన్నారు. గురువారం అంటివలస గ్రామంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడ ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోనూ, ఆశ్రమ పాఠశాలల్లో అతి చిన్న వయసు గల విద్యార్థులు మరణించడం చాలా బాధాకరమైన విషయమన్నారు. మండలంలోని దేవుకోన పంచాయతీ అంటివలసకు చెందిన ఊయక వెంకటేష్ కుమార్తె తేజశ్రీ (7) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం మృతి చెందిందన్నారు. ఇలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన విద్యార్థులతో పాటు గిరిజన గ్రామాల్లో విద్యార్థులు, పిల్లల మరణాలకు కారణాలను తెలుసుకునేందుకు వైద్యులతో కమిటీ వేసి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, గ్రామాల్లో పర్యవేక్షించి మెరుగైన వైద్యం అందించి గిరిజన విద్యార్థులు మరణాలను అరికట్టాలని కోరారు.

పాలనలో జిల్లా యంత్రాంగం విఫలం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో అధికార యంత్రాంగం ప్రజాపాలనలో పూర్తిగా విఫలమైందని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, పట్టణ అధ్యక్షులు సిగడాం భాస్కరరావులు విమర్శించారు. గురువారం వారు స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. గతంలో వర్షాకాలంలో, రోగాలు సీజన్లో విద్యార్థుల మరణాలు సంభవించేవని, ఇప్పుడు గతకొన్ని రోజులుగా విద్యార్థుల మరణాలు తల్లిదండ్రులకు దడ పుట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో నాగావళి, జంఝావతి, సువర్ణముఖి తదితర నదులు, గెడ్డల నుండి ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నా చర్యల్లేవన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రశ్నించిన వారిపై తిరిగి కేసులు పెట్టే స్థాయిలో యంత్రాంగం దిగజారిందని విమర్శించారు. పార్వతీపురం పట్టణంతో పాటు జిల్లాలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు దర్జాగా కబ్జాకు గురవుతున్నాయన్నారు. పట్టణంలో నకిలీ పట్టాలు దందా చలామణి అవుతున్న చర్యలు శూన్యమన్నారు. ఇక పట్టణంలో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నా చర్యలు శూన్యమన్నారు. ఇక జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ మచ్చుకి కానరావడం లేదన్నారు. మున్సిపాలిటీలో చెత్త డంపింగ్ యార్డ్ సమస్య ప్రజలను వేధిస్తోందన్నారు. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వం స్పందించి జిల్లా యంత్రాంగం చక్కగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నది వైసిపి ప్రభుత్వమేనని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ అన్నారు. మండలంలోని తెన్నుఖర్జ బిటి రోడ్డు నుంచి గొటివాడ వరకు 1.60 కిలోమీటర్ రూ.కోటీ 20 లక్షలతో కొత్తగా నిర్మించిన బిటి రహదారి, సచివాలయ భవనం, వెల్నెస్ సెంటర్ భవనాన్ని, పొడి నుంచి ఒప్పంగివరకు రూ.కోటీ 50 లక్షలతో సుమారు రెండు కిలోమీటర్లు, జి.శివడ నుండి మడ్డుగూడ 2 కిలోమీటర్లు రూ.కోటీ 60లక్షలతోనూ, మడ్డుగూడ నుండి నాంద్రగండ వరకు, గుజ్జువాయి బిటి రోడ్డు నుండి వై.కొత్తగూడా వరకు 1.50 కిలోమీటర్లు 85 లక్షలతో, నీలకంఠాపురం బిటి రోడ్డు నుండి నాయుడుగూడ 2.60 కిలోమీటర్లు రూ.కోటీ 50 లక్షలతో, నీలకంఠాపురం బిటి రోడ్డు నుండి కొత్తగూడ 40 పరలాంగులు రూ.32 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న బిటి రహదారులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో తమ ప్రభుత్వం గత ప్రభుత్వాల కన్నా రెట్టింపుతో అభివృద్ధి చేసిందని చేసిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనవసరంగా బురద జల్లుతున్నాయని ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ ప్రభుత్వానికి మరోసారి ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి గొర్లి సుజాత, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిషార్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు , వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అభివృద్ధి పనులను ప్రారంభించారు. వెలగవలస కూడలి నుంచి డోకిశీల వరకు పాడైన బిటి రహదారికి పునః నిర్మాణం చేయడం, డి కె పట్టణం పంచాయతీ నుంచి తాడంగివలస వరకు కొత్త బిటి రహదారిని నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అదే రహదారిలో రూ.27లక్షలతో నిర్మించిన పైప్ కలవర్ట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ వి.గురురాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సమస్యలపై సభ్యుల వాడీవేడి చర్చ

సమాధానమివ్వకుండా మధ్యలో వెళ్లిపోయిన ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ సమస్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు మున్సిపల్ అధికారులను నిలదీయడంతో సమావేశంలో వాడి వేడి చర్చ జరిగింది. సభ్యులడిగిన సమస్యలపై ఛైర్‌పర్సన్ సమాధానమివ్వకుండా సమావేశం మధ్యలో వెళ్లిపోవడంతో సభ్యులు అవాక్కయ్యారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. పట్టణ అభివృద్ధి కాగితాలకే పరిమితమయ్యాయని, సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు ఛైర్పర్సన్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారని, వేసవి దృష్ట్యా ఈ సమస్య పరిష్కారానికి సభ్యులతో పాటు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని 14వ వార్డు కౌన్సిలర్లు ద్వారపురెడ్డి శ్రీదేవి అన్నారు. దీంతో పాటు కర్షక మహర్షి ఆసుపత్రికి వెళ్లే రహదారిపై ఉన్న వరహాలగెడ్డపై ఉన్న బ్రిడ్జి కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసిన నిర్మాణాన్ని ఆపివేయడమేమిటని ఛైర్పర్సన్‌ను ఆమె ప్రశ్నించారు. ఛైర్‌పర్సన్ స్పందిస్తూ 15వ ఆర్థిక సంఘ నిధులతో త్వరలో నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. పలు కాలనీలకు, పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీరు సరఫరాకు నీళ్ల ట్యాంకర్లకు ప్రతి ఏటా రూ.3,4 లక్షలు అద్దె చెల్లించడమేమిటని మున్సిపల్ నిధులు నుంచి సొంతంగా వాటర్ ట్యాంక్‌ను కొనుగోలు చేయడం మంచిదని 14, 17, 21 వార్డుల టిడిపి కౌన్సిలర్లు అధికారులను సూచించారు. 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టిట్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు డబ్బులు చెల్లించారని, ఆ డబ్బును వెంటనే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ కె.శ్రీనివాస్ స్పందిస్తూ టిడ్కో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయానికి ఆదాయం సమకూర్చే మార్కెట్ ఆశీలు పాట 8 సార్లు వాయిదా పడడంలో ఆంతర్యమేమిటని పాటదారులు వేలం పాట పాడేందుకు సుముకత చూపించకపోవడమేమిటని కౌన్సిలర్ నారాయణరావు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ స్పందిస్తూ గత ఏడాది వేలం పాట ఎక్కువ పాటకు వెళ్లడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని, పాటదారులతో మాట్లాడి తగ్గిస్తామని హామీ ఇచ్చారు. తన వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ జరగలేదని, కాలువల్లో పూడికతీతలు తీయాలని టిడిపి కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, తాటిపూడి వెంకటరావు మున్సిపల్ ప్రజారోగ్య అధికారులను ప్రశ్నించారు. 13వ వార్డు వైసిపి కౌన్సిల్ సభ్యులు వండాన కృపాబాయి మాట్లాడుతూ, తమవార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, తాగునీటి సమస్య కూడా ఉందని, పారిశుధ్య నిర్వహణ కూడా జరగడం లేదని, తమ వార్డులో ఉన్న బైపాస్ రోడ్డు డంపింగ్ యార్డ్ తలపించేదిగా ఉందని పలుమార్లు ప్రజారోగ్య అధికార దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఛైర్పర్సన్ ను నిలదీశారు. ఛైర్పర్సన్ సమావేశ మందిరం నుండి బయటికి వెళ్లిపోవడంతో కౌన్సిలర్‌తోపాటు, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఛైర్పర్సన్ తీరుపై అవాక్కయ్యారు. సమావేశంలో మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్ శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటనాయుడు

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నాయుడు అన్నారు. నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు చదువులే ముఖ్యమని, బాల్య వివాహాలు జరిపి వారి భవిష్యత్‌ను పాడుచేయొద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. లీగల్, ప్రొబేషన్ జిల్లా అధికారి పి.శ్రీధర్ మాట్లాడుతూ పిల్లల హక్కులు, బాధ్యతల గూర్చి వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి అవగాహన కల్పించారు. బాలల అక్రమ రవాణా, బాలికలకు ఆపద సమయంలో అవసరమైన సహాయం కోసం చైల్డ్ కేర్ హెల్ప్ లైన్‌ను ఎలా సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఇన్‌ఛార్జి పిఒ ఎన్. ప్రసాదరావు, కౌన్సిలర్ జి.తవిటి నాయుడు, ఒఆర్‌డబ్ల్యు ఆర్.హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భావితరాల భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కురుపాం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని మూల బిన్నిడి, చాపరాయి బిన్నిడి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలే మిగిలాయన్నారు. రాక్షస పాలనకు చమర గీతం పాడి రానున్న ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మూల బిన్నిడిలో 70 కుటుంబాలు, చాపరాయి బిన్నిడిలో 50 కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, క్లస్టర్ ఇంచార్జి కె.దాసు, యూనిట్ ఇన్‌ఛార్జి ధర్మా, మండల నాయకులు కద్రక కళావతి, అనిల్, బలరాం, రామారావు తదితరులు ఉన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని నార్లవలస పంచాయతీ పరిధిలోని మారాయిపాడు, చినమారయ్యపాడు, నక్కడవలస, తాడిలోవలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యాన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ ఇంటి ఆడబిడ్డగా ఈ ఒక్క అవకాశం ఎమ్మెల్యేగా తనను ఎన్నుకుంటే గిరిజన ప్రాంత గ్రామాలు కొండ శిఖర గ్రామాలు, మైదాన ప్రాంత గ్రామాలను ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నానని తెలిపారు. ఈ గ్రామాల నుండి 30 కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, మాజీ సర్పంచ్, గిరిజన నాయకులు బేటుకురి తిరుపతి, లక్ష్మణదొర, లక్ష్మణరావు, శ్యామ్, తిరుపతి రావు, రమాదేవి, యుగంధర్, కృష్ణ, బాలాజీ, మరిపి సింహాచలం పాల్గొన్నారు.

సీతంపేట : శంఖారావంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి నాయకులు పడాల భూదేవి అవగాహనా కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. మహాశక్తి, యువగళం, అన్నదాత మొదలైన పథకాలపై వివరించారు. బాబు ష్యూరిటీ -భవిష్యత్ గ్యారంటీ గురించి అవగాహన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో టిడిపిని గెలిపించి ఈ సంక్షేమ పథకాలు పొందుదామని చెప్పారు. ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి రాక్షస పాలన అంతం చేయడానికి కంకణం కట్టుకోవాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో మండ పంచాయతీ సీనియర్ నాయకులు బిగ్‌బాస్, సూర్యం, మాజీ ఎంపీటీసీ బిడ్డిక జయలక్ష్మి, వలురౌతు సోమేశ్వరరావు, మాజీ కో ఆప్షన్ మెంబెర్ మూర మోహనరావు,మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో రస్తాకుంటుబాయి పంచాయతీలో గల తోటగూడలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటి ప్రచారంలో భాగంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి టిడిపి శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్ర దేవ్, రాష్ట్ర తెలుగు యువత అధికారి ప్రతినిధి కె.రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కొండయ్య, టిడిపి నాయకులు వెంకటరావు, వెంపటి భారతి, కె.కళావతి, మాజీ సర్పంచ్ మాశయ్య తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : మూలబిన్నిడిలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి జగదీశ్వరి



నిరుద్యోగ యువతకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ చైతన్య స్రవంతి

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

యువత అభిలాష గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఐ .గౌరీశంకర్ అన్నారు. గురువారం మొండెంఖల్ సచివాలయం వద్ద అభిలాస్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటి, జెఇఇ, నిట్, ఎస్ఎస్‌సి, సిజిఎల్, బ్యాంక్ పరీక్షలు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4, యుపిఎస్ఎస్, ఎస్సై, ఆర్‌బిఐ, కానిస్టేబుల్స్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు సరిపోయే పుస్తకాలు ఉన్నాయన్నారు. ఈ పుస్తకాలను సచివాలయంలో చదువుకోవచ్చుని, లేకుంటే ఒక్కొక్క పుస్తకం తీసుకెళ్లి చదువుకొని మళ్లీ తెచ్చి ఇవ్వవచ్చునని తెలిపారు. కావున యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ బి.ఆనంద్, ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షి డైరెక్టర్ అనిమా ఇందిరా కుమారి, వైసిపి నాయకులు ఆర్.సత్తిబాబు, ఇంటికుప్పల రామకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేట గ్రామ సచివాలయంలో అభిలాష్ గ్రంథాలయాన్ని గురువారం సర్పంచి ఆర్.చైతన్యస్రవంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులు, నిరుద్యోగ యువతి, యువకుల అన్ని రకాల పోటీ పరీక్షలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అభిలాష్ పేరుతో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఐఐటి, జెఇఇ, గ్రూప్-1, 4, ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డిఎస్‌సి తదితర పోటీ పరీక్షల సమాచారం అందుబాటులో ఉంటాయన్నారు. ఎల్విన్‌పేట మండల కేంద్రంలో ఎక్కువ విద్యాసంస్థలు ఉన్న సందర్భంగా ప్రతి ఒక్క విద్యార్థి అభిలాష్ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.